RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

## కేరళలో అబద్ధపు ప్రచారం

2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 75 | ఏప్రిల్ 04 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 75 | April 04 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## చిన్నారి కవలలను దారుణంగా చంపిన కసాయి తండ్రి

### కరీంనగర్ జిల్లాలో ఘటన

**కరీంనగర్ జనసంఘర్షణ**
కరీంనగర్ జిల్లాలో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగుచూసింది. కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో కన్నతండ్రే కాలయముడిగా మారి తన ఇద్దరు కవల కూతుళ్లను బావిలోకి తోసి హతమార్చాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీశైలం అనే వ్యక్తి తన ఇద్దరు చిన్నారి కవల పిల్లలను తీసుకువచ్చి బావిలోకి నెట్టేశాడు. ఆ తర్వాత తాను కూడా బావిలోకి దూకాడు. అయితే,

➤ మిగతా 2వ పేజిలో..

## పెరిగిన జీహెచ్ఎంసీ ఆదాయం

2

# తెలంగాణ డీఎన్ఏలోనే వస్త్ర తయారీ

### హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి



**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తెలంగాణను దక్షిణాసియాలోనే వస్త్ర రంగ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన 'తెలంగాణ రైజింగ్ 2047' రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. వస్త్ర తయారీ అనేది తెలంగాణ డీఎన్ఏలోనే ఉందని, నిజాం కాలం నుండే ఇక్కడి ముత్యాలు, వస్త్రాలకు ప్రపంచవ్యాప్త

➤ మిగతా 2వ పేజిలో..

## మరో మూడు రోజులు సమావేశాలు

### పలుబిల్లుల కోసం పొడగింపు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ముఖ్యమైన బిల్లుల ఆమోదం కోసం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. గురువారంతో రెండో దశ సమావేశాలు ముగిసి, సభ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించినప్పటికీ, తిరిగి ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు సమావేశం కావాలని నిర్ణయించారు. మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో నియోజకవర్గాల సంఖ్య పెంపునకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించుకోవడమే ఈ పొడిగింపు ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంటోంది. వీటితో పాటు వివాదాస్పదంగా

➤ మిగతా 2వ పేజిలో..

## చొరబాటుదారుల ఆగడాలకు యూసీసీతో అడ్డుకట

**హైదరాబాద్ జనసంఘర్షణ**
అస్సాం ఎన్నికల ప్రచారంలో భాగంగా గోల్‌పాడాలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయడం ద్వారా చొరబాటుదారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా నిరోధించేందుకు ఈ చట్టం దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీని మరోసారి గెలిపిస్తే అక్రమ వలసదారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన

➤ మిగతా 2వ పేజిలో..



## తెలుగు రాష్ట్రాలో మళ్లీ వర్షాలు

**హైదరాబాద్ / అమరావతి**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రానున్న కొన్ని గంటల్లో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉండవచ్చని



➤ మిగతా 2వ పేజిలో..

## ఫీజుల దోపిడీపై కవిత ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 12 వేల ప్రైవేట్ పాఠశాలల్లో ముఖ్యంగా సీబీఎస్సీ సిలబస్ ఉన్న స్కూల్స్ 25 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచి వసూలు చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం గురించి పదే పదే మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ విషయంపై మౌనం వహించడం

➤ మిగతా 2వ పేజిలో..

## భారత నౌకాదళంలో 'ఐఎన్ఎస్ తారాగిరి'



**విశాఖపట్నం జనసంఘర్షణ**
భారత నౌకాదళం మరింత శక్తివంతమైంది. అత్యాధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న యుద్ధనౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యుద్ధనౌకను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

➤ మిగతా 2వ పేజిలో..

## అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారంపై ఇరాన్ డ్రోన్లతో దాడి



**కువైట్ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కువైట్‌లోని అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారం 'మినా అల్-అహ్మది'పై ఇరాన్ డ్రోన్లతో దాడికి పాల్పడింది. శుక్రవారం జరిగిన ఈ దాడి కారణంగా రిఫైనరీలో భారీ ఎత్తున మంటలు చెలరేగాయని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ వెల్లడించింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రపంచంలోని కీలక చమురు

## తెలంగాణ డీఎన్ఏలోనే వస్త్ర తయారీ

**మొదటిపేజీ తరువాయి..** గుర్తింపు ఉందని సీఎం గుర్తుచేశారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతిబింబాలని పేర్కొన్నారు. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు వంటి వసతులతో పాటు వేగవంతమైన అనుమతులు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే, హైదరాబాద్ ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా మారుతున్న తరుణంలో, చిత్ర పరిశ్రమకు అవసరమైన ఫ్యాషన్ రంగాన్ని కూడా ఇక్కడి నుంచే ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్'లను అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## చిన్నారి కవలలను దారుణంగా చంపిన కసాయి తండ్రి

**మొదటిపేజీ తరువాయి..** బయటపడగా, అమాయక పిల్లలు మాత్రం నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న గ్రామస్థులు బావిలో వెతకగా, అప్పటికే ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పిల్లలను పొట్టనబెట్టుకున్న తండ్రిపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు, అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కుటుంబ కలహాలే ఈ ఘోరానికి కారణమని తెలుస్తోంది. ఈ ఘటనతో జూబ్లీనగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

## చొరబాటుదారుల ఆగడాలకు యూసీసీతో అడ్డుకట

**మొదటిపేజీ తరువాయి..** ప్రాంతాలపై యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారన్న కాంగ్రెస్ విమర్శలను అమిత్ షా తిప్పికొట్టారు. ఆదివాసీ ప్రాంతాలకు ఈ చట్టం నుండి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలోనే తొలిసారి ఒక గిరిజన మహిళ దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించారని, ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీదేనని గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రమైన మేఘాలయలో చొరబాటుదారులు స్థానిక గిరిజన మహిళలను వివాహం చేసుకుని రాజకీయ పలుకుబడి సంపాదించే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి ఉద్రిక్తతలకు చెక్ పెట్టాలంటే యూసీసీ అవసరమని వివరించారు. అస్సాంలో శాంతిని పునరుద్ధరించింది తమ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరగనుండగా, మే 4న ఫలితాలు విడుదల కానున్నాయి.

## భారత నౌకాదళంలో 'ఐఎన్ఎస్ తారాగిరి'

**మొదటిపేజీ తరువాయి..** డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (వీణా) నిర్మించిన ఈ నౌక, 'ప్రాజెక్ట్ 17-ూ'లో భాగంగా రూపొందిన నాలుగో యుద్ధనౌక. దీని ప్రత్యేకతల్లో ప్రధానమైనది శత్రువుల రాడార్లకు చిక్కకుండా పనిచేసే 'స్టెల్త్ సాంకేతికత'. సుమారు 149 మీటర్ల పొడవు, 6,670 టన్నుల బరువుండే ఈ నౌక, గంటకు 28 నాట్ల వేగంతో ప్రయాణించగలదు. ఇందులో బ్రహ్మోస్ క్షిపణులు, బరాక్-8 విమాన విధ్వంసక క్షిపణులతో పాటు అత్యాధునిక యాంటీ సబ్‌మెరైన్ వ్యవస్థలు ఉన్నాయి. విశేషమేమిటంటే, ఈ నౌక నిర్మాణంలో 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానాన్ని, భారతీయ ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను వినియోగించారు. ఇదే సందర్భంలో భారత్ తన మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ లిలి'ఐఎన్ఎస్ అరిదమన్'లిలిను కూడా జాబితాలో చేర్చుకుంది. దీనిపై రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. 'అరిదమన్' కేవలం ఒక పేరు మాత్రమే కాదు, అదొక గొప్ప శక్తి అని అభివర్ణించారు. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మిస్తున్న అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి అగ్రరాజ్యాల సరసన భారత్ చేరిందని ఆయన గర్వంగా ప్రకటించారు. ఈ జలాంతర్గాములు నెలల తరబడి సముద్ర గర్భంలో ఉంటూ శత్రువుల దాడులను దీటుగా తిప్పికొట్టగలవు. అనంతరం రక్షణ మంత్రి విశాఖలోని ఎన్ఎస్‌టీఎల్‌ను సందర్శించి, అక్కడ కొత్తగా ఏర్పాటు చేయనున్న కావిటేషన్ టన్నెల్‌కు శంకుస్థాపన చేశారు.

## అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారంపై ఇరాన్ డ్రోన్లతో దాడి

**మొదటిపేజీ తరువాయి..** కేంద్రాల్లో ఒకటైన ఈ కర్మాగారం రోజుకు సుమారు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తూ ఆసియా, యూరప్ దేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ ఇప్పటికే కువైట్ నుండి చమురు దిగుమతులను నిలిపివేసింది. గల్ఫ్ ప్రాంతంలోకి వస్తున్న డ్రోన్లు, క్షిపణులను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకుంటున్నాయని కువైట్ సైన్యం ప్రకటించింది. మరోవైపు బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ కూడా తమ దేశవ్యాప్తంగా సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ దాడితో అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మరో మూడు రోజులు సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..** మారిన ఎఫ్‌సిఆర్ఏ సవరణ బిల్లును కూడా ఈ ప్రత్యేక సమావేశాల్లోనే ఆమోదింపజేయాలని కేంద్రం భావిస్తోంది. కేరళ ఎన్నికల నేపథ్యంలో ఈ బిల్లుపై ఆచితూచి అడుగులు వేస్తున్న ప్రభుత్వం, ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే దీనిపై చర్చ చేపట్టనుంది. అయితే మహిళా రిజర్వేషన్ల అమలు తీరుపై ప్రతిపక్షాలు వ్యక్తంచేస్తున్న సందేహాలకు ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. జనగణన మరియు నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండానే మహిళా కోటాను అమలు చేసే అంశంపై విపక్షాలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో కేంద్ర సాయుధ పోలీసు దళాలకు సంబంధించి ఒకే రకమైన ఉద్యోగ నిబంధనలు వర్తింపజేసే బిల్లుకు పార్లమెంట్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ కీలక బిల్లుల కోసం పార్లమెంట్ మరో మూడు రోజుల పాటు కొసాగుతుందని తెలుస్తోంది.

## తెలుగు రాష్ట్రాలో మళ్లీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..** అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పిడుగులు పడే ముప్పు ఉన్నందున ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని, బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల వారు అధికారుల సూచనలను పాటించాలని హెచ్చరించారు. అటు తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈదురుగాలుల ప్రభావం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉండవచ్చని అంచనా. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో వర్షాలు పడతాయని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసిన అధికారులు, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు.

## ఫీజుల దోపిడీపై కవిత ఘాటు వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** సరికాదని విమర్శించారు. అసెంబ్లీలో కేవలం రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు గుంజుతున్నా, ఉపాధ్యాయులకు మాత్రం సరైన వేతనాలు పెంచడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సీఎం ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలను ప్రారంభిస్తూ వారి దోపిడీని ప్రోత్సహిస్తున్నారా అని ఆమె ప్రశ్నించారు. విద్యా సంస్థల్లో తెలంగాణ వారికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ, ప్రభుత్వం స్పందించకపోతే స్కూళ్ల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇక రాజకీయాల విషయానికొస్తే, తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ప్రస్తుతం ఖాళీగా ఉందని, దాన్ని ఎవరైనా వాడుకోవచ్చని ఆమె వ్యాఖ్యానించారు. తాము ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే నడుస్తామని, తమకు బిహార్ సిద్ధాంతకర్తలు ఎవరూ లేరని చెబుతూనే, ప్రస్తుతం బీఆర్ఎస్ నిద్రావస్థలో ఉందని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

## జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

**నగర ప్రజలకు పోలీసులు సూచనలు**

**హైదరాబాద్, ఏప్రిల్3 :** నగరవాసులకు ట్రాఫిక్ పోలీసులు కీలక సూచన చేశారు. హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ చేపట్టిన స్టీల్ ఫ్లై ఓల్గ÷వర్, అండర్‌పాస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ నియమాల్లో తాత్కాలిక మార్పులు చేయడం జరుగుతోందని హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయెల్ డెవిస్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు (మొత్తం 3 గంటల పాటు) కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ - వే ట్రాఫిక్ నిబంధనలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. భవిష్యత్‌లో శాశ్వతంగా అమలు చేయబోయే ట్రాఫిక్ మళ్లింపులపై పట్టు సాధించేందుకే ఈ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పంజాగుట్ట నుండి వచ్చే వాహనాలు మాదాపూర్‌కు వెళ్లేందుకు గాను రోడ్ నెంబర్-2 లో డైవర్షన్ తీసుకోవాలి. అటు నుంచి ఇందిరానగర్, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-5, రోడ్ నెంబర్-10 మీదుగా రోడ్ నెంబర్-45 కు చేరుకని మాదాపూర్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. మాదాపూర్ రోడ్ నెంబర్-45 నుంచి పంజాగుట్ట వైపు వచ్చే వాహనాలను జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ మీదుగా కేబీఆర్ పార్క్ ముందు నుంచి వన్ వేలో భాగంగా రోడ్డు నెంబర్-2 వైపునకు మళ్లించనున్నారు. రోడ్ నెంబర్ -10, 12 నుండి వచ్చే వాహనాలన్నీ అగ్రసేన్ మహారాజ్ జంక్షన్ నుంచి జర్నలిస్ట్ కాలనీ, బాలకృష్ణ ఇంటి ముందు నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ మీదుగా కేబీఆర్ పార్కు చేరుకునే విధంగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. హైదరాబాద్ ప్రజలందరికీ హైదరాబాద్ ట్రాఫిక్ అడ్వైజరీలో భాగంగా తెలియజేస్తున్న సూచనలను పాటించి ప్రజలంతా సహకరించాలి కోరారు.

## పెరిగిన జీహెచ్ఎంసీ ఆదాయం

**హైదరాబాద్**

జీహెచ్ఎంసీ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా పెరిగింది. ప్రధానంగా భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా కార్పొరేషన్‌కు భారీగా రాబడి సమకూరింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 1,172.08 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది (2024-25) వచ్చిన రూ. 1,138.44 కోట్లతో పోలిస్తే, ఈసారి సుమారు రూ. 34.36 కోట్ల అదనపు ఆదాయం లభించింది.

గడిచిన ఏడాది కాలంలో మొత్తం 2,427 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయగా, కేవలం 2025 మార్చి నెలలోనే రికార్డు స్థాయిలో 15,536 నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు. 'బిల్డ్ నౌ' పోర్టల్ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయడం వల్ల ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆస్తి పన్ను వసూళ్లలోనూ జీహెచ్ఎంసీ రికార్డులు సృష్టించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం రూ. 2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 995.82 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 1,000.36 కోట్లు, మల్కాజిగిరి పరిధిలో రూ. 562.62 కోట్లు వసూలయ్యాయి. కేవలం మార్చి 31వ తేదీ ఒక్కరోజే రూ. 162.94 కోట్ల బకాయిలు వసూలు కావడం విశేషం. పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ స్థాయిలో ఆదాయం లభించిందని జీహెచ్ఎంసీ వర్గాలు తెలిపాయి.

## కేరళలో అబద్ధపు ప్రచారం

**తిరువనతంపురం**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి కేరళ ప్రజలను అబద్ధాలతో తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పూర్తిగా విఫలమయ్యాయని, ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, పెన్షన్ల పెంపు, దళిత కుటుంబాలకు రూ.12 లక్షల పంపిణీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను ఎలాగైతే వంచించారో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తున్నారని ఆరోపించారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్లుగా ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేయడం తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నుండి కేరళ ఎన్నికల కోసం నిధులు తరలుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అందుకే రేవంత్ రెడ్డిని అక్కడ ప్రచారానికి పిలిపిస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేవలం కొన్ని పిల్లర్లకే పరిమితం కాకుండా, ప్రాజెక్టు మొత్తం మీద సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ కుటుంబంపై కేసులు పెట్టి జైలుకు పంపుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ఒక్క చర్య కూడా తీసుకోలేదని విమర్శించారు. తన అసమర్థతను దాచుకోవడానికి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు కాంగ్రెస్ మాటలను నమ్మవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## మేడారంలో తీవ్ర విషాదం

**రాతి కట్టడం కూలి బాలుడికి గాయాలు**

**ఆస్పత్రి తీసుకెళ్లగా కాలు తీసేసిన వైద్యులు**

**ములుగు, ఏప్రిల్3 :** ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారంలో తీవ్ర విషాదం నెలకొంది. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదం.. ఒక చిన్నారి జీవితంలో చీకటిని నింపింది. మేడారం పూజారి సిద్ధబోయిన రమేశ్ కుమార్ కొడుకు యువన్‌పై ఒక్కసారిగా రాతి కట్టడం కూలి పడటంతో ఈ దారుణం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. బాలుడు యువన్ ఆడుకుంటున్న సమయంలో సమీపంలోని ఒక రాతి కట్టడం ఒక్కసారిగా అతడిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే యువన్ తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాలుడిని తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండటంతో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో కాలును తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తమ కళ్ల ముందు ఆడుకోవాల్సిన బిడ్డ.. ఇలా కాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో వారి ఆవేదన చూసి స్థానికులు సైతం చలించిపోయారు.

# సింగరేణి నిర్లక్ష్యానికి గూడు చెదిరిన బతుకు!

- పద్నాలుగేళ్ల నిరీక్షణ..
- కన్నీరు మున్నీరవుతున్న దివ్యాంగుడు

ఇల్లందు ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)

సింగరేణి సంస్థ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా, ఆ సంస్థ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల జీవితాలు మాత్రం చీకట్లోనే మగ్గుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా, ఇల్లందు మండలం కళాసి బస్తీకి చెందిన మేకల ఓంకార్ అనే దివ్యాంగుడి దశాబ్ద కాలపు పోరాటమే దీనికి సజీవ సాక్ష్యం. జెకె-5 ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విస్తరణలో భాగంగా 14 ఏళ్ల క్రితం తన సొంత ఇంటిని కోల్పోయిన ఓంకార్, నేటికీ నిలువ నీడ లేక అల్లాడిపోతున్నాడు. ప్రాజెక్టు సమయంలో పునరావాస ప్యాకేజీ కింద అధికారులు నామమాత్రపు ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకున్నారే తప్ప, అప్పట్లో హామీ ఇచ్చిన విధంగా ఇంటి స్థలాన్ని కేటాయించడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఒక దివ్యాంగుడు అని కూడా చూడకుండా, తన హక్కు కోసం పద్నాలుగేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల హృదయాలు కరగకపోవడం గమనార్హం. "గూడు కోల్పోయిన నాటి నుండి నేటి వరకు అద్దె ఇళ్లలో మగ్గుతూ, ఆర్థికంగా కుంగిపోతున్నాను. దివ్యాంగుడినైన నేను నా భార్యాపిల్లలతో కలిసి రోడ్డున పడాల్సి వస్తోంది" అని ఓంకార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలసిపోయిన ఈ బాధితుడు, ఇప్పుడు జిల్లా మంత్రులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ వైపు ఆశగా ఎదురుచూస్తున్నాడు. మానవతా దృక్పథంతో ఆలోచించి, ప్రభుత్వం తక్షణమే స్పందించి తనకు రావలసిన ఇంటి స్థలాన్ని



కేటాయించి, తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నాడు. సామాన్యుడి త్యాగంతో నిర్మితమైన ప్రాజెక్టులు, అదే సామాన్యుడిని కన్నీరు పెట్టించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# భక్తులతో పోటెత్తిన ఇల్లందు పురవీధులు!

- విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ
- రాత్రివేళ విద్యుత్ కాంతుల మధ్య దిగ్విజయంగా 'వీర హనుమాన్ విజయ యాత్ర'!

ఇల్లందు ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)

హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇల్లందు ప్రఖండ పరిధిలో నిర్వహించిన 'శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర' ఆధ్యాత్మిక వైభవానికి అద్దం పట్టింది. విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం ప్రారంభమై రాత్రి వరకు కొనసాగిన ఈ భారీ బైక్ ర్యాలీ పట్టణ పురవీధుల్లో ఒక సరికొత్త చరిత్రను సృష్టించింది. కేసరి ధ్వజాలు చేతబూని, 'జై శ్రీరామ్' నినాదాలతో వేలాది మంది యువకులు, కార్యకర్తలు కదం తొక్కడంతో పట్టణమంతా ఆధ్యాత్మిక గర్జనతో మారుమోగింది. రాత్రివేళ విద్యుత్ కాంతుల మధ్య కాషాయ జెండాల రెపరెపలు, భక్తుల కోలాహలం ఇల్లందును భక్తి సాగరంలో ముంచెత్తాయి.

శోభాయమానంగా భారీ బైక్ ర్యాలీ: ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన వీర హనుమాన్ శోభాయాత్ర అత్యంత శోభాయమానంగా సాగింది. పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగిన ఈ భారీ బైక్ ర్యాలీలో వేలాది మంది యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. కాషాయ కండువాలు ధరించి, వీర హనుమాన్ చిత్రపటాలతో కూడిన జెండాలను ప్రదర్శిస్తూ సాగిన ఈ యాత్ర భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. మునుపెన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో జనసందోహం తరలిరావడంతో ఇల్లందు వీధులన్నీ కేసరి



వర్ణమయంగా మారాయి.

క్రమశిక్షణతో చాటిన హిందూ సమాజ ఐక్యత: ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత క్రమశిక్షణతో సాగిన ఈ విజయ యాత్ర హిందూ సమాజ ఐక్యతను చాటిచెప్పింది. రాత్రివేళ ప్రశాంతమైన వాతావరణంలో, వేలాది మంది భక్తులు సమన్వయంతో సాగడం విశేషం. ఉదయం ఆలయాలలో జరిగిన ప్రత్యేక పూజల అనంతరం, సాయంత్రం జరిగిన ఈ శోభాయాత్రతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ జిల్లా, ప్రఖండ స్థాయి నాయకులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని హనుమాన్ విజయ యాత్రను దిగ్విజయం చేశారు. ధర్మ రక్షణే ధ్యేయంగా, ఆధ్యాత్మిక భావనను చాటుతూ సాగిన ఈ యాత్ర భక్తుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది.

# ఉసిరికాయలపల్లిలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశం...

- నాయకుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య వేడుకలు

ఖమ్మం సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ)

వైరా నియోజకవర్గం, కారేపల్లి మండలం, ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీలో మోరపాక వీరబాబు, కృష్ణవేణి దంపతుల ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై వేడుకను సందడిగా మార్చారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ముఖ్య అనుచరులు, మండల నాయకులు ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల నెరవేరుతోందని నాయకులు పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఝా బ్రదర్స్ మోరపాక వీరబాబు, శ్రీనివాస్, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకుడు రెడ్డబోయిన జగ్గయ్యని శాలువాతో సన్మానించి ఘనంగా అభినందించారు. ఆయన గ్రామ అభివృద్ధికి చేస్తున్న సేవలను నాయకులు ప్రశంసించారు. అనంతరం అతిథులకు పూలమాలలు వేసి సత్కరించగా, కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది. గ్రామంలో ఐక్యత, సౌభ్రాతృత్వం ప్రతిఫలించేలా ఈ వేడుక నిలిచింది.





# విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి

- లక్ష్మాపూర్ సర్పంచ్ మంజుల సాయిలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -3(జన సంఘర్షణ )

విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలని లక్ష్మాపూర్ సర్పంచ్ మంజుల సాయిలు అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్-ఎస్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మంజుల సాయిలు మాట్లాడుతూ..సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. దేశభక్తిని, సేవా గుణాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ఎన్ఎస్ఎస్ ఏర్పాటైందన్నారు. విద్యార్థుల కర్తవ్యాలను గుర్తు చేస్తూ విద్యను అభ్యసించడమే కాకుండా సామాజిక సేవ ద్వారా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, జాతీయ సమైక్యత, లౌకిక, సామ్యవాద భావాలు, ప్రతీ ఒక్కరిలో పెంపొందింపజేయాలని అన్నారు. సమాజంపై అవగాహన ఏర్పరచుకోవడం, సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకడం, వాటి నివారణకు కృషి చేయడం పౌరుని బాధ్యతలు పెంపొందించడంలోను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కృషి చాలా ముఖ్యమన్నారు . ఎన్ఎస్ఎస్ యొక్క లక్ష్యం, ఆవశ్యకత విద్యార్థుల యొక్క పాత్రపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సాయిలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ రాణి, అధ్యాపకులు శంకరయ్య, శివకుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమల్లరెడ్డిలో ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి






భీకనూర్, ఏప్రిల్ 03 ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామం లో దొడ్డి కొమరయ్య జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని కురుమ సంఘం సభ్యులు దోడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి అలంకరించి జయంతి జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కోడూరి సాయగౌడ్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు. అలాగె జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోల్ల స్వామి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నమెంట్ వెంటనే ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరడమైనది.

# తుజాల్ పూర్‌లో శివాజీకి నివాళులు

బిబిపేట, ఏప్రిల్ 03. ( జన సంఘర్షణ )


కామారెడ్డి జిల్లా, బీబీపేట మండలం తుజాల్పూర్ గ్రామ బస్టాండ్ ఆవరణలో హైందవ సేన ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. హైందవ ధర్మ రక్షణలో శివాజీ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి పవిత్ర శ్రీనివాస్, హైందవ సేన అధ్యక్షులు ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు తలారి కిరణ్, ఉపాధ్యక్షులు గొల్ల నాగరాజు, హైందవ సేవ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దొడ్డి కొమురయ్య 99వ జయంతి

బోధన్: ఏప్రిల్ 03 జన సంఘర్షణ

సాలూర మండలంలో శుక్రవారం రోజున సాలూరులోని ఎమ్మార్వో కార్యాలయంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమరయ్య కురుమ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, తెలంగాణ తొలి అమరుడు నిజం దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా బానిస సంకెళ్ల నుండి విముక్తి కల్పించిన మహోన్నత వ్యక్తి. బడుగు బలహీన వర్గాల రైతాంగ పోరాటయోధుడు . ఈ కార్యక్రమంలో సాలూర సర్పంచ్ సొక్కం లావణ్య, రవి మందర్న, సర్పంచ్ రావుబా గంగాధర్ , బిజెపి మండల అధ్యక్షులు ఫతేపూర్, ఖాజాపూర్ సర్పంచ్ నూర్ హైమద్, చింతం నాగయ్య సాలూర, బోధన్ మండలాల కురుమ సంఘం అధ్యక్షులు మేడి రవి, సహకార సంఘం అధ్యక్షులు దేవరావు, కాజాపూర్ ఉప సర్పంచ్ చిద్రపు శ్రీనివాస్., గ్రామ పెద్దలు ఇల్తెపు గంగారం సాలెన్ సంజీవ్ సాంబాజి శెట్టిగొండ రాకెల్వర్, రమేష్, దేవేందర్, భూమయ్య, సురేష్, సాయికుమార్, శ్రీనివాస్, సిద్దు గోండ, పీరుగొండ, సాయిగొండ, మల్లేష్, సాయిలు, రాజు, పోశెట్టి, కురుమ కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.



# జనగణనలో ఖచ్చితత్వమే లక్ష్యం

- క్షేత్రస్థాయి శిక్షణను పర్యవేక్షించిన కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)

జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్ల కోసం మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగింపు సందర్భంగా, కలెక్టర్ స్వయంగా పాలకోయ తండాలో జరిగిన ప్రాక్టికల్ డెమోలో పాల్గొని ఇంటింటి సమాచార సేకరణను పర్యవేక్షించారు. మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో 34 మంది ఫీల్డ్ ట్రైనర్లకు డిజిటల్ పద్ధతులు, హౌస్ సెన్సెస్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపిన కలెక్టర్, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఈ డేటా ఎంతో కీలకమని పేర్కొన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఇంటిని కవర్ చేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన స్పష్టం చేశారు.



# పెగడపల్లి గ్రామంలో కుస్తీ పోటీలు

బోధన్ : ఏప్రిల్ 03 జన సంఘర్షణ

బోధన మండలం పెగడపల్లి గ్రామంలో శుక్రవారం ఎల్లమ్మ జాతర సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఆనవాయితీగా ఎల్లమ్మ వద్ద కుస్తీ పోటీలు నిర్వహిస్తామని చివరి కుస్తీకి రూ.5,000 లు ఇవ్వడం జరుగుతుంది. చుట్టుపక్క గ్రామాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారడి సాయిబాబా, ఉపాధ్యక్షులు బీరయ్య, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి లింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి సందీప్, గ్రామ పెద్దలు రాజారెడ్డి, సుదర్శన్, మేడి రవి, పోతరెడ్డి లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, రామయ్య నారాయణరెడ్డి, శంకర్, ఎస్కే హైమద్, ఎండి షబ్బీర్, నాగభూషణ్ రెడ్డి, లింగారెడ్డి, సాయిలు, సుదర్శన్ రెడ్డి, గణేష్ గౌడ్, నాగరాజు, పోశెట్టి గంగాధర్, లక్ష్మణ్ సాయిలు, మల్లారెడ్డి సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
శనివారం
04 ఏప్రిల్ 2026

# కారేపల్లి మార్కెట్ కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలి


- రైతు సంఘం డిమాండ్
- మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2400 చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




**ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ప్రతినిధి:(జన సంఘర్షణ)**
మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి రైతుల పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకుడు కమ్మ కోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రతి మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఎక్కడా కేంద్రాలు ప్రారంభం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు మొక్కజొన్నను తమ ఇళ్ల వద్దనే నిల్వ ఉంచుకుని అకాల వర్షాల కారణంగా నష్టం కలుగుతుందనే భయంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో మొక్కజొన్న ధరలు క్వింటాల్‌కు రూ.1600-1700 మాత్రమే పలుకుతున్నాయని, ఈ ధరలకు రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని, నల్లితెగులు కారణంగా మిర్చి పంట దిగుబడి కూడా తగ్గిపోయిందని ఆయన పేర్కొన్నారు. దీంతో రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంటపైనే ఆధారపడుతున్నారని, అయితే మార్కెట్ ధరలు పడిపోవడం వల్ల రైతాంగం తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2400కు మొక్కజొన్నను కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం చెప్పినట్లుగా 26 క్వింటాళ్ల పరిమితి కాకుండా ఎకరానికి సుమారు 40 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు అప్పుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లేటి నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాశం అప్పారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లీ దీ. నాగేశ్వరరావు, నాయకులు కే. లోతు లక్ష్మణ్, గుగులోతు తేజ నాయక్, శంకర్ పాల్గొన్నారు. అలాగే అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు రావుల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

# కునారిల్లుతున్న కుండల వ్యాపారం

- గిరాకీ లేక కుమ్మరుల కన్నీరు!
- మేకల విజయ్ కీలక సూచనలు



**భద్రాచలం ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)**
భద్రాచలం పట్టణంలో ఎండలు నిప్పులు చెరుగుతున్నా, మట్టి కుండల వ్యాపారుల జీవితాల్లో మాత్రం చల్లదనం కరువైంది. పాత మార్కెట్ , ప్రధాన కూడళ్లలో కుండలు గుట్టలుగా పేరుకుపోయినా, కొనే నాథుడు లేక వ్యాపారులు దిగులు చెందుతున్నారు. గతంలో వేసవి మొదలవ్వగానే అమ్మకాలతో బిజీగా ఉండే తాము, ప్రస్తుతం రోజంతా నిరీక్షించినా బోణి కూడా కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్రిడ్జ్ సంస్కృతి పెరగడం, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేకపోవడంతో కుమ్మరి కుటుంబాలు ఆర్థికంగా కునారిల్లుతున్నాయి. ఆరోగ్య రక్షణలో మట్టి కుండ పాత్ర - మేకల విజయ్ కీలక సూచనలు: వేసవి తాపాన్ని తీర్చడంలో మట్టి కుండ నీరు అమృతంతో సమానమని, అయితే వాటిని వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరని భద్రాచలానికి చెందిన నిపుణులు మేకల విజయ్ పలు సూచనలు చేశారు:

నానబెట్టడం: కొత్త కుండను వాడటానికి ముందు కనీసం ఒక రోజంతా నీటిలో నానబెట్టాలి.

శుభ్రత: బ్యాక్టీరియా చేరకుండా ఉండాలంటే ప్రతిరోజూ వేడి నీటితో కుండను కడగడం శ్రేయస్కరం.

సబ్బు వాడకండి: మట్టి కుండను కడిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్బు లేదా డిటర్జెంట్ వాడకూడదు.

ప్రత్యామ్నాయం: కుండను శుభ్రం చేయడానికి కేవలం ఉప్పు లేదా బేకింగ్ సోడాను మాత్రమే వాడాలని ఆయన స్పష్టం చేశారు. పరిశుభ్రత పాటించినప్పుడే మట్టి కుండలోని నీరు ఆరోగ్యానికి పూర్తిస్థాయిలో మేలు చేస్తుందని మేకల విజయ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఇల్లందు వేదికగా.. దేశవ్యాప్త రైతు గర్జన!

- మే 11 నుంచి ఇల్లందులో ఐక్య రైతు జాతీయ మహాసభలు
- రైతు పోరాటాలకు ఇల్లందు నుండే సరికొత్త దిక్సూచి!




**ఇల్లందు ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)**
ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం, పెరిగిన ధరల నేపథ్యంలో దేశవ్యాప్త రైతు పోరాటాలను ఉధృతం చేసేందుకు మే 11, 12, 13 తేదీల్లో ఇల్లందు పట్టణంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు నాయకులు పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య వెల్లడించారు. శుక్రవారం చంద్ర కృష్ణమూర్తి భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ, 16 రాష్ట్రాల నుండి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరయ్యే ఈ మహాసభలు దేశ రాజకీయ, సామాజిక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ తుమ్మలపల్లి ప్రసాద్ అధ్యక్షతన ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయగా, మొదటిరోజు వేలాది మందితో భారీ ప్రదర్శన మరియు బహిరంగ సభ ఉంటుందని జాతీయ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా, మాస్ లైన్ నాయకులు బిక్షమయ్య, నాయిని రాజు, బి.రాము తదితరులు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


## ఇల్లందులో ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

- భక్తులకు అన్నదానం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కుటుంబం



**ఇల్లందు ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)**
ఇల్లందు పట్టణంలోని మెయిన్ (సి ఎస్ఐ)చర్చిలో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలకు డోర్నకల్ డయాసిస్ రైట్ రెవరెండ్ బిషప్ పద్మారావు, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు దైవ సందేశాన్ని భక్తులకు వినిపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది. ప్రార్థనల అనంతరం చర్చికి విచ్చేసిన సంఘ సభ్యులందరికీ మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టరేట్ చైర్మన్ ప్రకాష్ రావు అయ్య, సెక్రటరీ తోకల యేసు రత్నం, కమిటీ సభ్యులు, యూత్, స్త్రీల మైత్రి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## నాలుగేళ్లుగా మిషన్ భగీరథ నీళ్లు లేవని గ్రామస్తుల ఆవేదన



**తానూర్, ఏప్రిల్ 3 (జన సంఘర్షణ)**
నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఝరి (బి) గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా నాలుగేళ్లుగా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ మాదిగ సాటే కాలనీలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామస్తులు పలుమార్లు మిషన్ భగీరథ అధికారులకు విన్నవించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని వాపోయారు. తానూర్ ఎంపీడీఓ, నిర్మల్ జిల్లా డీఎల్పీఓలు వెంటనే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. అదేవిధంగా, మిషన్ భగీరథ పనుల సందర్భంగా సీసీ రోడ్, బ్రిడ్జ్ తవ్వి పైప్‌లైన్ వేసి అలాగే వదిలేయడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక పలువురు అందులో పడిపోతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు తవ్విన రహదారులను మరమ్మతు చేసి ప్రజలకు భద్రత కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి నిర్వాసితుల పక్షాన సమరశంఖం

- విజయలక్ష్మి నగర్ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతి!



**ఇల్లందు ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)**
ఇల్లందు ఏరియా ఓపెన్ కాస్ట్ (ఓసీ) ప్రాజెక్టు కారణంగా నిలువ నీడ కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, విజయలక్ష్మి నగర్ సర్పంచ్ నేతృత్వంలో అఖిలపక్ష నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి నగర్ సర్పంచ్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ముందస్తు సమాచారం లేకుండా, సరైన పునరావాసం కల్పించకుండా విజయలక్ష్మి నగర్ నిర్వాసిత ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడం అత్యంత దారుణమని, ఇది పేద ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాల వల్ల వందలాది కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేసిన సర్పంచ్, ఎమ్మెల్యే గారు వెంటనే జోక్యం చేసుకొని అందరితో చర్చించి, బాధితులకు న్యాయమైన పరిహారం, ప్రత్యామ్నాయ వసతి కల్పించే వరకు సింగరేణి మొండివైఖరిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇవ్వగా, ఈ కార్యక్రమంలో తిలక్ నగర్ సర్పంచ్, అఖిలపక్ష నాయకులు, బాధిత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మానవసేవే మాధవసేవ సర్పంచ్...

- అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్







**ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ప్రతినిధి: (జన సంఘర్షణ)**
అప్పాయిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మృదు స్వభావి, విద్యావేత్త, మనసున్న మహారాజు దండు ప్రవీణ్. గ్రామ అభివృద్ధి కాకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను మంచి మనసుతో మానవత్వ దృక్పథంతో అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కుటుంబంలో ఆడబిడ్డ పుడితే వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, సుకృతి నిధి పథకం కింద పోస్ట్ ఆఫీసులో అకౌంట్ తీపించి, సుకన్య సమృద్ధి యోజన పథకంలో 5016/- రూపాయలు ఆర్థిక సహాయం అందించి, ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. అదేవిధంగా సంత్వన నిధి పథకం కింద కుటుంబంలో ఏ వ్యక్తి అయినా మరణించినచో వారి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 5000/- రూపాయలు ఆర్థిక సహాయాన్ని వెంటనే ఆ కుటుంబానికి అందించడం జరిగింది. ఈ రెండు పథకాలు సర్పంచ్ ప్రమాణస్వీకారం చేసిన దగ్గర నుండి అమలు చేయడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో పథకాలు చేస్తానని సర్పంచ్ దండు ప్రవీణ్ గారు తెలిపారు. ఈ సేవ కార్యక్రమాలను అందుకున్న ప్రజలు భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిష్టించాలని, గొప్ప స్థాయిలోకి వెళ్లాలని గ్రామపంచాయతీ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## తుంగిని పుష్కరాల ఘాట్లను సందర్శించిన సిపి



- నిజామాబాద్ పోలీస్ కమిషనర్

**బోధన్ : ఏప్రిల్ 03 జన సంఘర్షణ**
నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్. నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల తుంగిని పుష్కర ఘాట్లను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా 2027 సంవత్సర కాలంలో రాబోయే గోదావరి పుష్కరాలతో ఉద్దేశించి పుష్కర ఘాట్ల ఏర్పాట్లు , మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, పుష్కర ఘాటుకు వచ్చే రోడ్డు, వెళ్లే దారులను , పార్కింగ్ ప్రదేశాల, నీళ్లలో ఎవరు కూడా మునిగి ప్రాణా నష్టం జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటులను చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులతో మాట్లాడి గత పుష్కరాల్లో ఏమేం లోటుపాట్లు ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి పార్కింగ్ సమస్యలు, ఇతర అవరోధాలు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పినారు. ఈ సందర్భంగా నిజామాబాదు నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట్ ఎస్ఐ శ్రీకాంత్, తుంగిని సర్పంచ్ కాంతారావ్, ఉపసర్పంచ్ భూమేష్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫరిదిపేటలో బోరు మోటార్ ఏర్పాటు



**పాల్వంచ, ఏప్రిల్ 03 ( జన సంఘర్షణ )**
కామారెడ్డి జిల్లా, పల్వంచ మండలం ఫరిప్పేటలో నెలకొన్న తాగునీటి సమస్యకు సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి తక్షణ పరిష్కారం చూపారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, యుద్ధ ప్రాతిపదికన కొత్త బోరు మోటార్ను ఏర్పాటు చేయించారు. గ్రామంలోని ఏ వార్డులో నీటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. వేగంగా స్పందించి నీటి కొరత తీర్చినందుకు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గుట్టను గుల్లగా మార్చడాన్ని ఆపాలి

◆ కాళికాదేవి విగ్రహానికి ప్రమాదం, గ్రామస్థుల ఆందోళన

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ప్రతినిధి: (జన సంఘర్షణ)



సింగరేణి మండలం గుట్టకిందగుంపు గ్రామపంచాయతీ పరిధిలోని గంగాదేవి గుట్టపై అక్రమ మట్టి తవ్వకాలపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గిడ్డంగి నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్ అనుమతులు లేకుండా భారీగా మట్టి తీయడం వల్ల గుట్ట నాశనమవుతుండడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు ఈ రోజు సంబంధిత అధికారులను నిలదీశారు. గుట్టపై స్వయంభుగా వెలసిన కాళికాదేవి విగ్రహానికి ఎలాంటి సపోర్ట్ లేకుండా మట్టి తీయడం వల్ల విగ్రహం కూలిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసులు, గిరిజనుల ఆరాధ్యదైవమైన కాళికామాత విగ్రహానికి హాని కలగడం వారి మనోభావాలను దెబ్బతీయడమేనని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఇప్పటికే లక్షల రూపాయల విలువైన మట్టిని అక్రమంగా తవ్వి విక్రయించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ మొత్తాన్ని రికవరీ చేసి గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా గిడ్డంగి నిర్మాణం ఎలా జరుగుతుందో అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. ఈ ఘటనపై మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, సర్పంచ్ రాఘవులు, లక్ష్మీ నర్సు, కాంగ్రెస్ నాయకులు తోగర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇండ్ల నిర్మాణం

◆ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



భైంసా, మార్చ్ 3 (జన సంఘర్షణ)

అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. భైంసా మండలంలోని మాంజ్రీ గ్రామంలో కవుదేకర్ మానజీ ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. గత పాలకుల హయాంలో పది సంవత్సరాలు ఇండ్లు నిర్మించి ఇవ్వక పోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. అర్హులందరికీ దశల వారిగా ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సొలంకి భీమ్రావ్, మాజీ ఎం.పి.పి. రజాక్, భైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి, స్థానిక సర్పంచ్ మారుతి, సర్పంచ్‌లు సిరం రాజమణి శ్రీనివాస్, సుధాకర్, అశోక్, బెల్ తరోడా సర్పంచ్ సాయినాథ్, మాజీ ఎం.పి.టి.సి. అశోక్ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, మాజీ సర్పంచ్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## తానూర్‌లో "గంజా గస్తీ" నిర్వహణ

◆ మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు

తానూర్,మార్చ్ 3 (జన సంఘర్షణ)




జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీసు అధికారి డా. జనకి శర్మిల ఆదేశాల మేరకు తానూర్ మండల పరిధిలో ఈ రోజు "గంజా గస్తీ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాన్ షాపులు, కిరాణా దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజా లేదా ఇతర మాదక ద్రవ్యాల విక్రయం జరుగుతున్నాయా అనే అంశంపై పోలీసులు సమగ్రంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా గంజా వంటి మాదక ద్రవ్యాలను అమ్మకానికి ఉంచకూడదని దుకాణ యజమానులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అలాగే మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం చట్టపరంగా నేరమని, ఇటువంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. తమ పరిసరాలలో ఎక్కడైనా గంజా లేదా ఇతర మాదక ద్రవ్యాల విక్రయం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా తానూర్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.కె. జుబేర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# ముధోల్ నియోజకవర్గానికి మహర్దశ

◆ 6న సిఎం రాకతో అభివృద్ధి పై ఆశలు
◆ ఆలయ పునర్నిర్మానం పట్ల భక్తుల్లో ఆనందం
◆ 180కోట్ల రూపాయల నిధులు బాసర మాస్టర్ ప్లాన్‌కు
◆ 200 కోట్ల రూపాయల నిధులు ముధోల్ ఇంటిగ్రేటెడ్ స్కూలుకు

ముధోల్,మార్చ్ 3 (జన సంఘర్షణ)

దశాబ్ద కాలానికి పైగా అందరి ఆశలు బాసర ఆలయ పునర్నిర్మాణం జరగాలని, ఈనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసరకు రావడం శంకుస్థాపన చేయడంతో ఇక అమ్మవారి క్షేత్రం లో అభివృద్ధి జరుగుతుందన్న ఆనందం భక్తుల్లో నెలకొంది. గతంలో ఉన్న పాలకులు బాసర ను నిర్లక్ష్యం చేశారని అమ్మవారి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని శాసనసభ్యుడిగా ఎన్నికైన అప్పటినుంచి పట్టు వదలని విక్రమార్కునిలా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అసెంబ్లీలో పదేపదే ప్రస్తావించడం, ముఖ్యమంత్రి, మంత్రులను కలవడంతో శంకుస్థాపనకు బీజం పడింది. పుష్కరాలపై ముఖ్యమంత్రి నిర్వహించిన అధికారిక సమావేశంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాల్గొనడంతో మరింత ప్రాధాన్యత ఏర్పడింది. బాసరకు నిధులు మంజూరు అయ్యాయని సీఎం తెలియజేయడంతో అక్కడే అధికారిక సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పి, మా ముధోల్ నియోజక వర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇవ్వాలని, నియోజకవర్గం చాలా వెనుకబడిందని, పాఠశాల మంజూరు చేస్తే, మీ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని సీఎంకు విన్నవించడంతో ఆగ మేఘాల మీద ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 200 కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో ఎమ్మెల్యే పటేల్ ఒప్పించి, మెప్పించి నియోజకవర్గానికి 380 కోట్ల రూపాయలు తేవడంలో సఫలీకృతుడు అయ్యాడని చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ హయంలో బాసర ఆలయ పునర్ నిర్మాణం జరగడం, ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు వంటి పనులు పూర్తయితే చిరస్థాయిగా నిలిచిపోతాయి. ముధోల్ లోని ఐ హాస్పిటల్ ముందు ఉన్న 15 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం జరగనుంది. 200 కోట్ల రూపాయల నిధులతో, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అన్ని అంగులతో స్కూల్ ఏర్పాటు కానుంది. హై టెక్నాలజీ తో కూడిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు అయితే ఆ పాఠశాలలో 3 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తారు. ఈ పాఠశాల ముధోల్ ప్రాంతానికి తలమానికం కానుంది. అదేవిధంగా బాసర ఆలయం రాజగోపురాలు, అత్యధిక హంగులతో ఆలయ నిర్మాణం



జరిగితే, అమ్మవారి క్షేత్రానికి మరింత భక్తులు రానున్నారు.

## దోమకొండ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి



దోమకొండ, ఏప్రిల్ 03 ( జన సంఘర్షణ )

దోమకొండ మండల కేంద్రంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే వనదుర్గ పెద్దమ్మ ఆలయ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కామారెడ్డి మున్సిపల్ ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సూచించారు. ఉత్సవాలకు హాజరుకావాలని మున్సిపల్ ఛైర్పర్సన్కు శుక్రవారం ముదిరాజ్ సంఘ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కాచపూర్లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



బిక్కనూర్, ఏప్రిల్ 03 ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా, బిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి లబ్ధిదారులను అభినందించారు. ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చడంతో పాటు, రైతులకు మద్దతు ధర కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భైంసా ప్రాంతీయ ఆసుపత్రిలో ఘనంగా 108 ఈఎంటీ డే నిర్వహణ

భైంసా, ఏప్రిల్ 3: (జన సంఘర్షణ)

భైంసా ప్రాంతీయ ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎం,హెచ్ఓ) డా. రాజేందర్ ఆధ్వర్యంలో 108 ఈఏంటి డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎంహెచ్ఓ డా. రాజేందర్, జిల్లా వైద్య అధికారి (డిసిహెచ్) డా. కాశీనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్ సేవల ప్రాముఖ్యతను వైద్య సిబ్బంది వివరించారు. ప్రజలకు ప్రాణాధారంగా నిలిచే 108 సేవలు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి అనేక ప్రాణాలను కాపాడుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు, గుండెపోటు, మెదడు సంబంధిత వ్యాధులు, గర్భిణీల అత్యవసర పరిస్థితుల్లో ఈ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. డా. రాజేందర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా 108 సేవలు అందుబాటులో ఉండడం వల్ల సమయానికి వైద్య సహాయం అందుతోందని అన్నారు. సంఘటనా స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించి బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించడం ద్వారా అత్యవసర వైద్య సిబ్బంది విశేష సేవలందిస్తున్నారని తెలిపారు. 108 ఈఎమ్ టి లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం, గత



ఒక సంవత్సరంలో జిల్లాలో మొత్తం 31,977 అత్యవసర ఘటనలకు 108 అంబులెన్స్ సేవలు అందించబడ్డాయి. ప్రమాద బాధితులు, గర్భిణీలు, ఇతర అత్యవసర రోగులకు సమయానుకూలంగా సేవలు అందించడం ద్వారా వేలాది మంది లబ్ధి పొందినట్లు తెలిపారు. నిర్వాహక అధికారి జనార్ధన్ మాట్లాడుతూ..108 అంబులెన్స్ సేవలు అత్యవసర సమయంలో ప్రజలకు ప్రాణాధారంగా నిలుస్తున్నాయని చెప్పారు. అత్యవసర వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ మానవతా విలువలను ప్రతిబింబిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డా. విజయానంద్, డా. అనిల్, డా. కైలాస్ తదితర వైద్యులు, 108 సిబ్బంది లక్ష్మణ్ పూజారి, నర్సయ్య, ఖాజామోయినొద్దీన్, అనిల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వెంటనే 108 సేవలను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## గ్రామంలో భక్తిశ్రద్ధలతో సాగిన అఖండ హరినామ సంకీర్తన సమాప్తి

కల్లూరు) ఏప్రిల్ 3/(జనసంఘర్షణ)

పోతంగల్ మండల కేంద్రంలోనీ కల్లూరు గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలో భక్తిశ్రద్ధలతో సాగిన అఖండ హరినామ సంకీర్తన పూర్తయిన తర్వాత, కమప్ప మహారాజ్ గారు గ్రామ ప్రజలకు గొప్ప ఆధ్యాత్మిక మార్గనిర్దేశం చేశారు. గ్రామస్థులు నిత్యం భగవద్గీతను పఠిస్తూ భక్తి మార్గంలో ముందుకు సాగాలని కోరుతూ, ఆయన ఆరు భగవద్గీత గ్రంథాలను పంపించారు. మహారాజ్ గారి ఆదేశానుసారం ఈ గీతా పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకుని, ఆదర్శవంతమైన జీవనాన్ని గడపాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఈ సంకల్పంతో కల్లూరు గ్రామం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శనివారం
04 ఏప్రిల్ 2026

# ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలకు ఇల్లెందులో ఆహ్వాన సంఘం ఏర్పాటు

◆ **మే 11 బహిరంగ సభ, 12-13 ప్రతినిధుల సభ విజయవంతానికి విస్తృత సన్నాహాలు**

ఇల్లెందు . మార్చ్ 3 . (జన సంఘర్షణ )

ఇల్లెందు, ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి ఈరోజు ఇల్లెందు పట్టణంలోని కామ్రేడ్ ఎల్లన్న భవనంలో ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశం కామ్రేడ్ బుర్ర ఎంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పోటు రంగారావు, దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలు రైతుల సమస్యలను జాతీయ స్థాయిలో వినిపించే ముఖ్య వేదికగా నిలుస్తాయని తెలిపారు. మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ, రైతుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగాలని పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక విధానాలను ఎదిరించేందుకు సంఘటిత శక్తి అవసరమని, ఈ మహాసభలు ఆ దిశగా కీలక అడుగని అన్నారు. కేచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రైతులను చైతన్యపరచి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రాము అన్న మాట్లాడుతూ, మే 11న జరగనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావాలని, అలాగే మే 12, 13 తేదీలలో జరిగే ప్రతినిధుల సభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కామ్రేడ్ చిన్న చంద్రన్న మాట్లాడుతూ, రైతు సమస్యలపై లోతైన చర్చలు జరిగి ఉద్యమానికి స్పష్టమైన దిశ లభిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో కొల్లేటి నాగేశ్వరరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ముద్ద బిక్షం, అరుణ అక్క, నాయిని రాజు, అమర్లపూడి రాము తదితరులు పాల్గొని మహాసభల ఏర్పాట్లపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మహాసభల విజయవంతం కోసం గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతు సమస్యలను ముందుకు తీసుకువెళ్లి, సంఘటిత పోరాటంతో పరిష్కారాలు సాధించాలనే సంకల్పంతో నాయకులు పిలుపునిచ్చారు.




# బీర్కూర్లో అంగరంగ వైభవంగా రథోత్సవం

◆ **ఎడ్లబండ్ల ఊరేగింపు... గజ్జలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు**

బీర్కూర్ /ఏప్రిల్ 3/(జన సంఘర్షణ)

హనుమాన్ జయంతి ఉత్సవంలో భాగంగా కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ధర్మతేజ, ఉప సర్పంచ్ పరమేష్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బీర్కూరులో హనుమాన్ జయంతి ఉత్సవాలు కన్నుల పండుగ కొనసాగుతున్నాయి. గురువారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించగా శుక్రవారం సాయంత్రం గజ్జలమ్మ ఆలయం నుంచి బయలుదేరిన రథోత్సవం హనుమాన్ ఆలయం వరకు చేరుకుంది. రథోత్సవాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. గోవిందా, జై హనుమాన్, జైశ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున భక్తులు, యువత నినాదాలు చేయడంతో గ్రామ వీధులు మారి మోగిపోయాయి. హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెలబడుతుంది. హనుమాన్



జయంతి ఉత్సవ భాగంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. కమప్ప ఆలయం నుంచి గజ్జలమ్మ ఆలయం వరకు ఈ ఎడ్లబండ్ల ఊరేగింపు కొనసాగింది. ప్రతి ఎటా హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. గురువారం హనుమాన్ జయంతి, శుక్రవారం రథోత్సవం, ఎడ్లబండ్ల ఊరేగింపు, శనివారం కుస్తీ పోటీలతో హనుమాన్ జయంతి ఉత్సవాలు ముగిస్తాయి. హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో జాతర కొనసాగుతుంది. పెద్ద ఎత్తున మహిళలు గజ్జలమ్మ ఆలయం కు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి ఇంటి ఆడపడుచులు తమ స్వగ్రామానికి చేరుకుంటారు. ప్రతి ఇండ్లలో కుటుంబ సభ్యులతో ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతారు. హనుమాన్ జయంతి ఉత్సవ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మహేందర్ గట్టి బందోబస్తు చేశారు. హిందూ వాహిని, ముస్లిం సోదరులు జాతరకు వచ్చే భక్తుల కోసం మంచి ఇంటి సౌకర్యం ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో ముస్లిం సోదరులు మత సామరస్యాన్ని చాటారు.

# కడెం మండలం మాసాయిపేట గ్రామ సర్పంచ్ లహరి ఆత్మహత్య

నిర్మల్/ ఏప్రిల్ 3/(జన సంఘర్షణ)

నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట్ గ్రామ సర్పంచ్ లహరి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. పురుగుల మందు తాగి అపస్మార్కస్థతిలో పడి ఉన్న లహరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశారు. ఆమె ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. మాసాయిపేట సర్పంచ్ లహరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నా పాల్పడి అపస్మార్కస్థితిలో పడి ఉండగా. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కారులో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు.లహరిని తీసుకువెళ్తున్న కారు వేగంగా వెళ్తూ మార్గమధ్యలో అదుపు తప్పింది. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను కారు బలంగా ఢీకొట్టింది.ఈ ఘోర



ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతినగా లహరి పరిస్థితి మరింత విషమించింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలు విడిచారు. ఒకే వైపు ఆత్మహత్యాయత్నం, ఇటు రోడ్డు ప్రమాదం జరగడంతో సరైన సమయంలో గ్రామ సర్పంచ్ లహరికి వైద్య సేవలు అద్దకపోవడంతో మార్గమధ్యంలోనే మృతి చెందారు. ఆమె మృతి పట్ల మాసాయిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సర్పంచ్ లహరి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలేంటి? ప్రమాదం ఎలా జరిగింది? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# జశ్వంత్ యాదవ్ 29 వ జయంతి వేడుకలు

◆ **ఘనంగా టీఎన్ఎస్ఎఫ్ మాజీ నేత జశ్వంత్ యాదవ్ జయంతి వేడుకలు**
◆ **నివాళులర్పించిన ముద్రగడ వంశీ కృష్ణ**
◆ **తెలుగునాడు విద్యార్థి విభాగం బలోపేతానికి జశ్వంత్ చేసిన కృషి చిరస్మరణీయం**

తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి, నిరంతర విద్యార్థి పోరాట యోధుడు పరికర జశ్వంత్ యాదవ్ (పి.జె) 29వ జయంతి వేడుకలు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. టీఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు, సీనియర్ విద్యార్థి నాయకులు, జశ్వంత్ యాదవ్‌కు అత్యంత ఆప్త మిత్రులైన దాసరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ కృష్ణ, విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చందవత రమేష్ బాబు పాల్గొన్నారు. తొలుత జశ్వంత్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, అతిథుల సమక్షంలో కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ కృష్ణ, సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ.. జశ్వంత్ యాదవ్ అతి చిన్న వయసులోనే తెలుగుదేశం సిద్ధాంతాలకు ఆకర్షితుడై, విద్యార్థి దశ నుంచే పార్టీ పట్ల అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. విద్యార్థి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు చేస్తూ, టీఎన్ఎస్ఎఫ్‌లో తనదైన ముద్ర వేశారని, ఆయన మరణం పార్టీకి, విద్యార్థి విభాగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన దాసరి గోపాలకృష్ణ, జశ్వంత్ యాదవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ముందుంటారని, వారిద్దరి అనుబంధం విద్యార్థి నాయకులకు స్ఫూర్తిదాయకమని నేతలు పేర్కొన్నారు. జశ్వంత్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు గొగ్గల రాజేష్, ముక్కు శ్రీవేద్, కామ ప్రణయ్, దేవరకొండ నవీన్, లిఖిల్ యాదవ్, సన్నీ, సాయి శ్రావణ్ తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు కృషి..

పోతంగల్/ఏప్రిల్3/(జన సంఘర్షణ)




తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని నిజామాబాద్ జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు ఈరుగొండ అన్నారు. తెలంగాణ , తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు ఈరుగొండ అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని దొడ్డి కొమురయ్య, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం.. భుక్తి కోసం..ఈ సందర్భంగా ఈరుగొండ మాట్లాడుతూ.. భూమికోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం కొమురయ్య ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దోపిడీలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి అమరుడయ్యారని.. ఆయన సాహసాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచారన్నారు. ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షాజీ పటేల్, లోని జగన్, బజరంగ్, విజయ్, సాయిలు ప్రభాకర్, రాజ్ కుమార్, మోహన్, మల్లు గొండ, సాయగొండ, శ్రీనివాస్, గంగొండ, భీంరావు, తదితరులు పాల్గొన్నార్ను

# బడా పహాడ్ శివార్లో ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా

◆ **8 మందికి తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు**

వర్ని) ఏప్రిల్ 3/( జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని బడాపహాడ్ శివారు లో యాత్రికులతో వస్తున్న బస్సు బోల్తా పడింది. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో పటాన్ చెరువు కు చెందిన యాత్రికులు ప్రైవేట్ స్కూల్ బస్సులో వస్తుండగా బడా పహాడ్ అటవీ ప్రాంతంలో మూలమలుపు వద్ద బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో బోల్తా పడింది. ప్రమాదంలో 8 మందికి తీవ్ర గాయాలు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 35 మంది యాత్రికులు ఉన్నారు. గాయపడిన వారిని నిజామాబాద్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించార్ను

# వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

◆ **తనిఖీల సమయంలో కార్యాలయంలో అనాధికార ఏజెంట్లు, రైటర్లు**

తెలంగాణ/ఏప్రిల్ 3/(జన సంఘర్షణ)





వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కొనసాగించారు. ఏసీబీ సోదాల సమయంలో కార్యాలయంలో అనధికార ఏజెంట్లు, రైటర్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. డాక్యుమెంట్ రైటర్ల సెల్ఫోన్లతో పరిశీలించిన ఏసీబీ అధికారులు. 20 మంది అనధికార ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు. ఏడాదిలో రూ, 42 లక్షల ఫోన్ పే లావాదేలు జరిగినట్లు గుర్తించిన ఎసిబి. 204 డెలివరీ కానీ డాక్యుమెంట్లు ఎస్ఆర్వోల వద్ద ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఎస్ఆర్ఓలు రామ నరసింహారావు, ఆనంద్ మధ్య వాట్సప్ చాట్ బహిర్గతం. లెక్కల్లో చూపనిరూ 47,450 నగదు, 70 దస్తాలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు. ఎస్ ఆర్ ఓ, ఆనంద్ కు కపిల్ చిట్స్లో రూ.30 లక్షల విలువైన ఫిక్స్ డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారుల సోదాలో వెలుగు చూశాయి. ఎస్ ఆర్ వో లు రామ నర్సింహారావు, ఆనంద్ నివాసాలలో తనిఖీలు చేసిన ఏసీబీ అధికారులు. ఎస్ ఆర్ ఓ ఇళ్లల్లో రూ 24.61 లక్షల నగదు, 820 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు. ఎస్ ఆర్ ఓ లలో 2.6 కిలోల వెండి ఆభరణాలు, స్వాధీనం చేసుకున్న ఏసిబి అధికారులు. ఇంకా ఏసీబీ సోదాలు సాగుతూనే ఉంటాయి. వీరిద్దరిని ఏసీబీ అధికారులు అదుపులకు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

# అంబరాన్ని తాకిన విగ్రహ ప్రతిష్ఠాపన

పొతంగల్/ఏప్రిల్ 3/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోనీ పాత పోతంగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి మందిర విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఊరిలో పండుగ వాతావరణం ఏర్పడింది. దీంతో ప్రతి ఆడబిడ్డకు మంగళ హారతులు బహుమతులుగా అందజేయడం. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వారిని కూడా సన్మానించడం జరిగింది .కార్యక్రమంలో అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్లైన్ వద్దు.. ఆన్లైన్లోనే ఇసుక

- మన ఇసుక వాహనం పోర్టల్ ద్వారా ఇసుక కొనుగోలు
- ఈ ఆర్థిక సంవత్సరానికి ఖనిజ అభివృద్ధి సంస్థకు వెయ్యి కోట ఆదాయం.

జన సంఘర్షణ డెస్క్ . మార్చ్ 3.
రాష్ట్ర వ్యాప్తంగా నదుల్లో, వాగుల్లో ఉన్న ఇసుక నిల్వలను ఇండ్ల నిర్మాణాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తూ ఎంతోమంది ఇసుక మాఫియా లక్షలు గడ్డించారు. ఇకనుంచి వారికి చెక్ పెట్టడానికి, తెలంగాణ ప్రభుత్వం ఆన్లైన్ లోనే బుక్ చేసుకొని ఇసుక తీసుకెళ్లడానికి ,మన ఇసుక వాహనం, అనే పోర్టల్ ను తీసుకువచ్చింది. ఈ పోర్టల్ లో మెమో నంబర్ 4958 ప్రకారం అన్ని జిల్లాలో మన్యువల్ ఇసుక కూపన్ల జారిని తక్షణం నిలిపివేయాలి. ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు ఎక్కడి నుంచి ,ఏ రీచ్ నుంచి ఇసుకను తీసుకెళ్తారు ?ఎక్కడికి తీసుకెళ్తారు ?ఏ అభివృద్ధి కోసం ఈ ఇసుకను వాడుతారు? అన్న వివరాలు మీ బుకింగ్ ఆర్డర్లో ఐడితో ప్రదర్శించబడతాయి. ఆన్లైన్ ద్వారా ఇసుక తీసుకోవాలంటే ముందుగా ఇంటి అనుమతి కాపీని అప్లోడ్ చేయాలి. పని వివరాలను నమోదు చేయండి. నిబంధనాలను షరతులను అంగీకరించబడతాయి. పిన్ అప్డేట్ విజయవంతం అయింది అనగానే ,ఇసుక బుకింగ్ కోసం లాగిన్ అనే సందేశం కనిపిస్తుంది. ఈ సందేశంలో డిజిటల్ ఇసుక పోర్టల్ ద్వారా ఆన్లైన్లో ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీంట్లో ముఖ్యంగా జిల్లా అధికారుల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. దీంట్లో మొదటి దశలో అధికారికంగా ఇసుక రీచ్ లను గుర్తించాలి. రెండో దశలో నిర్దేశించిన బ్యాంకు ఖాతాలను తెరవడం. మూడవ దశలో ఇసుక రేట్ చార్జీలను ఖరారు చేయడం. మ్యానువల్ నుంచి డిజిటల్ వ్యవస్థకు ఎం ఐ వి ఓటిపిఎస్ డిజిటల్ ప్రవర్తన వచ్చింది. దీంట్లో అధికారుల బాధ్యత చాలా కీలకంగా ఉంటుంది. సి జి జి సిస్టం కన్ఫిగరేషన్ కాగానే లాగిన్ కోసం డేటా సేకరించాలి. రేట్ చార్ట్ కేటగిరీలు గృహ అవసరాలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ప్రభుత్వ పనులు వీటికి ఇందిరమ్మ ఇండ్లకు 12 శాతం జీఎస్టీ, 400 రూపాయలు లోడింగ్ చార్జింగ్ , విలేజ్ ఫండ్200, మొత్తం 612 రూపాయలు ఒక ట్రాక్టర్కు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి యజమాని 300 రూపాయలు టీజీఎండిసి వంద రూపాయలు జీఎస్టీ 12 రూపాయలు లోడింగ్ ఛార్జ్ 400 రూపాయలు విలేజ్ ఫండ్ 200 రూపాయలు మొత్తం 1173 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. గవర్నమెంట్ పనుల కోసం డిస్టిక్ అడ్మిన్ కోసం 300 రూపాయలు ఖనిజ అభివృద్ధి సంస్థకు రూ,100 సిబిఎం చార్జ్ 120 రూపాయలు లోడింగ్ చార్జ్ 400 రూపాయలు ,విలేజ్ ఫండ్ 200 రూపాయలు, మొత్తం 1173 రూపాయలు చెల్లిస్తే ఆన్లైన్ ద్వారా సిజిజి మీ జిల్లాను ఎలా యాక్టివ్ చేస్తుంది. మొదటి దశలో బ్యాంకు ఖాతా ఇంటిగ్రేషన్ యూజర్ లాగిన్ సృష్టి. మూడవ దశలో రేట్ చార్జి అప్లోడ్, నాలుగో దశలో అందరికీ శిక్షణ, ఐదో దశలో సిస్టం గో లైవ్ సిస్టం యాక్సిస్ వెబ్ పోర్టల్ టీజీఎంఐవీ.సీజీజీ.జీఓవీ.ఇన్ మొబైల్ యాప్ ద్వారా ప్రారంభించబడుతుంది. సిస్టం పనిచేయాలంటే తాసిల్దార్లు పంచాయతీ కార్యదర్శులు డేటా నిర్దేశించిన ఫార్మాట్లో అందించాలి. మండలం పేరు, తాసిల్దార్ ,పంచాయతీ కార్యదర్శి పేరు, మొబైల్ నెంబర్ ,ఈమెయిల్ ఐడి తప్పనిసరిగా ఉండాల్సి ఉంటుంది. డిజిటల్ భవిష్యత్తు చివరి అడుగులు గో-లైవ్ కు మార్గం, ఇసుక రీచ్లు బ్యాంకు, ఖాతాలు రేట్ చార్జీలను ఖరారు చేస్తారు. అధికారి డేటాను సిజిజి అందిస్తారు. సిజిజి సిస్టంలో కాన్ఫిగర్ చేసి శిక్షణ ఇస్తుంది. జిల్లాలో 100 శాతం ఆన్లైన్ బుకింగ్కు మారుతుంది. పారదర్శకమైన డిజిటల్ భవిష్యత్ కు మీ జిల్లా సిద్ధంగా ఉంది. మధ్యవర్తి లేకుండా, పైరవీలు లేకుండా ,రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా మన ఇసుక వాహనం పోర్టల్ ద్వారా




ఆన్లైన్లో ఇసుక పొందవచ్చు. ఇప్పటివరకు ఆఫ్లైన్లోనే ప్రభుత్వం ఇసుక అందించింది. దీనివల్ల ఇసుక మాఫియా పేట్రేగిపోయి అక్రమ ఇసుక దందాకు పాల్పడ్డారు.. ఇకనుంచి ఇసుక మాఫియా కు చెక్ పెట్టడానికి ప్రభుత్వం ఖనిజ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ,మన ఇసుక వాహనం, పోర్టల్ ను తీసుకొచ్చింది.

**2025- 26 సంవత్సరానికి గాను రాష్ట్ర ఖనిజా అభివృద్ధి సంస్థకు 1000 కోట్లు...** ఇస్కా మైనింగ్ విక్రయ విధానాలలో కీలక సంస్కరణలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెచ్చిపెడుతుంది. 2025-26 కు గాను ఇసుక విక్రయాల ద్వారా రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థకు 1000 కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చింది. రికార్డు స్థాయిలో ఒక్క 1008 రూపాయల కోట్ల ఆదాయం ఖనిజ అభివృద్ధి సంస్థకు ఖజానాలో చేరింది. ఇసుక విక్రయాల ద్వారా రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థకు 1000 కోట్లు వచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక దంథా కొనసాగకుండా ,ప్రభుత్వ రీచ్ ల నుంచి ఆన్లైన్ ద్వారా అవసరమైన వారు ఇసుక కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా పోర్టల్ ను ఏర్పాటు చేసింది. దీనివల్ల ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చే అవకాశాలు ఉన్నాయి.

# కుల వివక్ష.. ప్రేమజంట ఆత్మహత్య

సిద్దిపేట జిల్లా/ఏప్రిల్ 3/(జన సంఘర్షణ,)
ప్రస్తుతం సమాజంలో సాంకేతిక రంగం ఎంతో ముందుకు దూసుకు వెళ్తుంది, దీనికి తోడు చంద్ర మండలంలో అడుగుపెడుతున్న ఈ కాలంలో ఇంకా కుల వివక్ష కొనసాగుతూనే ఉంది. కుల వివక్ష పోవడానికి డాక్టర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారు. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో ఇంకా కుల వివక్ష కొనసాగుతుంది. కుల వివక్ష కారణంగా ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది.సిద్దిపేట జిల్లాలో ఘోరం చోటుచేసుకుంది. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో అనుముల రాకేష్ రెడ్డి (25), తరిగొప్పుల హారిక (22) అనే ప్రేమజంట ఒకరినొకరు ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. పెళ్లైన మూడు నెలలకు స్వగ్రామానికి తిరిగి వచ్చిన వీరిని, కులాలు వేరు కావడంతో రాకేష్ రెడ్డి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఇటీవల హారిక ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు రాకేష్ రెడ్డి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కౌన్సిలింగ్ అనంతరం పెళ్లి చేస్తామని చెప్పినా, ఆలస్యం చేస్తున్నారని మనస్తాపంతో రాకేష్ రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడ్డారు. కుల వివక్ష చూపుతున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ పలువురు కోరుతున్నారు.



# కార్పొరేట్ రంగంలో గిరిజన బిడ్డలు సత్తా చాటాలి

- కొత్తగూడెం మేయర్ ముడు గణేష్ ఆకాంక్ష!
- రిలయన్స్ జియో ప్రాజెక్ట్ మేనేజర్ భూక్య శేఖర్‌కు ఘన వీడ్కోలు..
- పదోన్నతిపై గుజరాత్ జాంనగర్‌కు పయనం

కొత్తగూడెం ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)
గిరిజన యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా, కార్పొరేట్ రంగంలోనూ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొత్తగూడెం మేయర్ ముడు గణేష్ పిలుపునిచ్చారు. రిలయన్స్ జియో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌గా గత ఏడు సంవత్సరాలుగా విశేష సేవలందించిన భూక్య శేఖర్, పదోన్నతిపై గుజరాత్‌లోని జాంనగర్‌లో ఉన్న దేశంలోనే అతిపెద్ద రిలయన్స్ ఇండస్ట్రీస్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబుతో కలిసి మేయర్ ముడు గణేష్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.




ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, భూక్య శేఖర్ తన ఏడేళ్ల ప్రస్థానంలో తోటి ఉద్యోగులతో, సమాజంలోని ప్రముఖులతో ఎంతో స్నేహభావంతో మెలిగి జిల్లాలో రిలయన్స్ జియో విస్తరణకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. గిరిజన బిడ్డలు కార్పొరేట్ రంగంలో కీలకమైన మేనేజ్మెంట్ పదవుల్లోకి ఎదగడం సమాజానికి గర్వకారణమని, శేఖర్ సాధించిన ఈ విజయం ఎంతోమంది గిరిజన యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే తత్వం ఉంటే కార్పొరేట్ ప్రపంచంలో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆకాంక్షించారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ, వృత్తి పట్ల అంకితభావం ఉన్న అధికారులకు ఎక్కడికి వెళ్లినా గుర్తింపు లభిస్తుందని, శేఖర్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ జిల్లా కోఆర్డినేటర్ బండి విజయభాస్కర్, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జర్పుల ఉపేందర్, లావుడియా హరిలాల్, వంశీ, రమేష్ నాయక్, సాంబ నాయక్ తదితరులు పాల్గొని భూక్య శేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇద్దరు కూతుళ్లకు గడ్డి మందు తాగించి బావిలో పడేసిన తండ్రి

కరీంనగర్/ఏప్రిల్ 3/(జన సంఘర్షణ)



కన్న పిల్లల్ని కంటికి రెప్పలా చూడాల్సిన తల్లిదండ్రులు పిల్లలే వారికి భారమవుతున్నారు. భార్య భర్తల మధ్య గొడవలు జరిగితే వారు వారు సరిచేసుకోవాల్సి ఉండగా ఆ ప్రతాపం కన్న పిల్లలపై చూపుతున్నారు. కొన్నిచోట్ల భార్య భర్త వేధింపుల భరించలేక పిల్లల్ని కాలువల్లో, చెరువుల్లో తల్లి సైతం దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో చోటు చేసుకుంటుంటాయి. తాజాగా భార్యతో గొడవపడి భర్త తన ఇద్దరు కవల పిల్లలు గడ్డి మందు తాగించి బావిలో పడేసిన ఘటన కరీంనగర్ జిల్లాలో కలకాలం సృష్టించింది. కరీంనగర్ జిల్లా జూబ్లీనగర్లో విషాదం చోటుచేసుకుంది. భార్యతో గొడవ పడిన భర్త శ్రీశైలం కోపంతో ఐదేళ్ల వయస్సున్న తన ఇద్దరు కవల కూతుళ్లకు గడ్డి మందు తాగించాడు. అనంతరం వారిని బావిలో పడేశాడు. బావిలో ఒకరి మృతదేహం లభ్యం కాగా మరొకరి కోసం గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కొడిచెర్ల గ్రామంలో దొడ్డి కొమురయ్య జయంతి




కొమరయ్య ఫోటో పూలమాలలు వేసి మిఠాయిల పంపించేసి ఆయన చేస్తున్న సేవలో, వశిష్టగాంచిన, అని గ్రామ సర్పంచ్ మొండె కవిత ఐర్వంత్, ఉప సర్పంచ్ కోటగిరి గంగారం, బిర్ దేవు కురుమ సంగం కోడిచర్ల అధ్యక్షులు బిర్లా వేంకటేష్, ఉపాధక్షులు నగేష్, మల్లేష్బిర్లా కేశవరావు, పర్స నగేష్, బిర్ల సాయిలు, దండే సాయిలు, కె.గంగారాం, విరేశం తుర తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్లను అకస్మిక తనిఖీ చేసిన నిజామాబాద్ సూపర్వైజర్ స్వరాజ్

- పలు సూచనలు చేసిన స్వరాజ్

నిజామాబాద్ /ఏప్రిల్ 3/(జనసంఘర్ష)
నిజాంబాద్ జిల్లాలోని బోధన్ డివిజన్లో రుద్రూర్, పోతంగల్, కోటగిరి, సాలూర, 108 అంబులెన్స్లను ఆకస్మిక తనిఖీ చేసిన నిజాంబాద్ సూపర్వైజర్ స్వరాజ్ బోధన్ డివిజన్లోని నాలుగు మండలాలను ఆంబులెన్స్లను ఆకస్మిక తనిఖీ చేసిన నిజాంబాద్ సూపర్వైజర్ స్వరాజ్ అంబులెన్స్ పనితీరును నిల్వ ఉన్న మందులను ఎప్పటికప్పుడు కాలం చెల్లిన మందులను అంబులెన్స్ లో ఉంచకూడదని టెక్నీషియన్స్ కు సూచనలు చేశారు. బోధన్ డివిజన్లోని పలు మండలాల్లో నా అంబులెన్స్లను ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూపర్వైజర్ స్వరాజ్ తెలియజేశారు. అంబులెన్స్ కు వచ్చిన ప్రతి ఫోను కీలకమని ఆయన ఆదేశించారు. బోధన్ డివిజన్లో పలు మండలాల్లో 24 అవర్స్ అందుబాటులో ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలను అందించాలని ఆయన సూచించారు. బోధన్ డివిజన్లోని సాలూర రుద్రూర్ కోటగిరి పోతంగల్ మండలాల్లోని అంబులెన్స్లను ఆకస్మిక తనిఖీ చేసి పైలెట్లకు టెక్నీషియన్స్ పలు సూచనలు చేశారు. కస్మిక తనిఖీలో భాగంగా అంబులెన్స్ లో పరికరాలను నిల్వ ఉన్న మందులను క్షుణంగా పరిశీలించి టెక్నీషియన్స్ పైలట్లకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటే సేవలు చేసే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండి అంబులెన్స్ సేవలను ప్రజలకు సేవలు అందించాలని స్వరాజ్ సూచించారు.



# మహాత్మ మన్నించు....

- మహాత్మ గాంధీ విగ్రహం కాలుకు చున్ని కట్టి ఉరి వేసుకున్న యువకుడు

పొతంగల్/ఏప్రిల్ 3/(జన సంఘర్షణ)
పొతంగల్ మండల కేంద్రం జిల్లపల్లి గ్రామంలో దిగవ్ సంతోష్ వయసు 35 సంవత్సరాలు, మద్యానికి బానిస ప్రతిరోజు విచ్చలవిడిగా మద్యం మత్తులో ఉంటూ మద్యం పచ్చని కాపురాలను చిన్న భిన్నం చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇష్ట రాజ్యంగా వెలిసిన బెల్ట్ షాపుల వల్ల చిన్న పిల్లలు మొదలుకొని యువకులు మద్యానికి బానిసై తల్లిదండ్రులను, భార్య పిల్లలను వేధిస్తూ డబ్బులు ఇవ్వకుంటే వారిపై దాడులకు పాల్పడడంలే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు తెలంగాణ రాష్ట్రంలో వెలుగు చూస్తూనే ఉన్నాం. తాజాగా మద్యం మత్తులో.. పూర్తి విషయాలు కొద్దిసేపట్లో తెలవబడును.



## సింగరేణి నిర్వాసితుల పక్షాన సమరశంఖం

**- విజయలక్ష్మి నగర్ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతి!**

ఇల్లందు ఏప్రిల్ 03 (జన సంఘర్షణ)



ఇల్లందు ఏరియా ఓపెన్ కాస్ట్ (ఓసీ) ప్రాజెక్టు కారణంగా నిలువ నీడ కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, విజయలక్ష్మి నగర్ సర్పంచ్ నేతృత్వంలో అఖిలపక్ష నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి నగర్ సర్పంచ్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ముందస్తు సమాచారం లేకుండా, సరైన పునరావాసం కల్పించకుండా విజయలక్ష్మి నగర్ నిర్వాసిత ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడం అత్యంత దారుణమని, ఇది పేద ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాల వల్ల వందలాది కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేసిన సర్పంచ్, ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకొని అందరితో చర్చించి, బాధితులకు న్యాయమైన పరిహారం మరియు ప్రత్యామ్నాయ వసతి కల్పించే వరకు సింగరేణి మొండివైఖరిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇవ్వగా, ఈ కార్యక్రమంలో తిలక్ నగర్ సర్పంచ్, అఖిలపక్ష నాయకులు, బాధిత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## ఘనంగా ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్స్ లో గుడ్ ఫ్రైడే ఆధ్యాత్మిక కార్యక్రమం

**- ముఖ్య అతిథిగా హాజరైన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.**

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 3 (జన సంఘర్షణ):



కూకట్‌పల్లి నియోజకవర్గంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఎన్ కె ఎన్ ఆర్ గార్డెన్స్ లో పరలోనేస్తం చర్చి వారు ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా నిర్వహి ంచబడింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. రేవ్. ఇసాక్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఎమ్మెల్యేకి ఆశీర్వాదాలు అందించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, "యేసుక్రీస్తు తన ప్రాణాలను ఒక వర్గం కోసం కాదు, సమస్త మానవజాతి కోసం అర్పించారు. ఆయన ప్రేమ, త్యాగం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం" అని పేర్కొన్నారు. అలాగే సమాజంలో ప్రేమ, ఐక్యత, సేవ భావనలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో మజ్జిగ, పానకం పంపిణీ కార్యక్రమం

**- ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య.**



హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 03 (జన సంఘర్షణ):

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలో హనుమాన్ జయంతి సందర్భంగా మజ్జిగ పానకం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎక్స్ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య పూజలు నిర్వహించి పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమల ప్రసన్న నగర్ మాజీ అధ్యక్షులు శేఖర్ ,ప్రదీప్ రెడ్డి జగదీష్ రవీందర్రావు రమేష్ నరహరి గౌడ్, మారుతి ప్రసాద్ అఖిల్ కళ్యాణ్ రాకేష్ జైహింద్ సోనాల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సనత్‌నగర్‌లో మిన్నంటిన 'గుడ్ ఫ్రైడే' ప్రార్థనలు

**- భక్తిశ్రద్ధలతో క్రాస్ ర్యాలీ**

హైదరాబాద్ ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 03 (జన సంఘర్షణ):



లోక రక్షకుడు ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని స్మరిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గంలో 'గుడ్ ఫ్రైడే' వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాస్ ర్యాలీ (సిలువ యాత్ర) స్థానికులందరినీ ఆలోచింపజేసింది. స్థానిక ఇమ్మానుయేల్ ఎం.బి. చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని పాస్టర్ రెవ. ఎ. శ్రీనివాస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఏసుక్రీస్తు తన మరణం ద్వారా మానవాళికి అందించిన త్యాగాన్ని, ఆయన పడిన శ్రమలను గుర్తుచేస్తూ భక్తులు నిశ్శబ్దంగా, భక్తి భావంతో ఆధ్యాత్మికంగా పురవీధుల గుండా సాగారు. ఏసుక్రీస్తు సిలువను మోస్తున్న దృశ్యాలు, ఆయన కష్టాలను ప్రతిబింబించే కథాంశాలు ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా రెవ. ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ.. "మానవాళి మనుగడ కోసం, పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు తన ప్రాణాలను బలి ఇచ్చారు. ఆయన చూపిన ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణం నేటి సమాజానికి ఎంతో అవసరం. క్రీస్తు మార్గంలో నడుస్తూ తోటివారి పట్ల జాలిని ప్రదర్శించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి." ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ పరిధిలోని వివిధ చర్చిల ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో ఐక్యంగా పాల్గొన్నారు. ముఖ్యంగా మెథడిస్ట్ చర్చ్, బాప్టిస్ట్ చర్చ్, సి.ఎస్.ఐ (సీఎస్ ఐ) చర్చ్, ఇండిపెండెంట్ యునైటెడ్ చర్చ్, సియోన్ చర్చ్, బెతేల్ ప్రేయర్ హౌస్ నిర్వహణలో రేవ్. కె.జె. క్లెమెంట్,గేర్షోన్ ప్రకాష్, జోవార్ కెన్నెడీ, రాజగోపాల్, కె.సి. నిస్సి జోష్వా, బెంజమిన్ డబెట్టా, కె. సనీల్, బిజి విలియం తదితరులు పర్యవేక్షకులుగా వ్యవహరించి, వేడుకలు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.

## కెపిహెహెచ్‌బి కాలనీ ముస్లిం మైనారిటీ ఆధ్వర్యంలో రామ్ సేనతో మేము సైతం

**- వెయ్యి మందికి చల్లటి మజ్జిగ మంచినీరు పంపిణీ చేసిన.. సూర్య ఉదయం భాషా...షేక్ సత్తార్...**

హైదరాబాద్,కూకట్ పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 03 (జన సంఘర్షణ):



కూకట్పల్లి నియోజకవర్గం కేపిహెచ్బి కాలనీ లో హనుమాన్ జయంతి సందర్భంగా రామసేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ లో నిర్వహించిన హనుమాన్ విరాట్ శోభాయాత్ర 2026 లో బాగంగా రామ్ సేన తో మేము సైతం అంటూ కూకట్ పల్లి కెపిహెచ్ బి ముస్లిం మైనారిటీ సభ్యులు శోభాయాత్రలో పాల్గొనడం జరిగినది. ఈ శోభయాత్ర కు విచ్చేసిన భక్తులకు సుమారు 1000 మందికి పైగా వాటర్ బాటిల్స్, చల్లటి మజ్జిగా పంపిణీ చేయడం జరిగింది. కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ ,నూర్ భాషా దూదేకుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు భాషా ను, టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సత్తార్ ను ఈ కార్యక్రమంలో పాల్గొన్న విలేకరులను డిసిపి రితీరాజ్, కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి ఇంచార్జి బండి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రామ సేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్రలో పాల్గొన్న భక్తులకు వాటర్ బాటిల్స్ మరియు మజ్జిగ అందించడమే కాక ప్రతి ఒక్క హిందు సోదరుని ఆప్యాయతంగా పలకరించి అలాయ్ బలాయ్ కలవడం జరిగినది. భాషా ,షేక్ సత్తార్ మాట్లాడుతూ ఆసియా లోనే అతిపెద్ద కాలనీగా పేరుపొందిన కె పి హెచ్ బి కాలనీలో కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసి జరుపుకుంటామని తెలియజేశారు. ఈ శుభ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హనుమాన్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సింగర్ నల్గొండ గద్దర్ నరసన్న, స్థానికులు మహబూబ్ (కచ్చిన్), సీనియర్ విలేకరులు కరీం భాయ్, నజీర్ భాయ్, గంగన్న, చంద్ర, రాము, రెహ్మాన్, ప్రవీణ్, షబ్బీర్, శివ ,శ్యాం సుందర్, క్రాంతి కుమార్, బాల కృష్ణ, సునీల్, మహమ్మద్ హుస్సేన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో తొలిసారిగా పీఆర్ ఎక్స్ పో కార్యక్రమం

**- జర్నలిజం విద్యార్థుల వృత్తి నైపుణ్యంలో భాగంగా ఏర్పాటు.**

హైదరాబాద్, కుత్బుల్లాపూర్ ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 03 (జన సంఘర్షణ):

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ బాచుపల్లి క్యాంపస్ లో నేడు పీఆర్ ఎక్స్ పో నిర్వహించనున్నట్లు పర్యవేక్షకురాలు, జర్నలిజం అధ్యాపకురాలు డా. ఎస్. హసీనా పేర్కొన్నారు. ఎంఏ జర్నలిజం విద్యార్థులకు ప్రజా సంబంధాల మెరుగుదల, కమ్యూనికేషన్ నైపుణ్యం కోసం ఈ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఉన్నత విద్య పూర్తి చేసుకుని, మీడియా రంగంలో నిలదొక్కుకోవాలనే విద్యార్థులకు ఇలాంటివి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు చొరవ, వృత్తి నైపుణ్యంలో మెళకువలు అలవడతాయని హసీనా తెలిపారు. వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ప్రోత్సాహంతో నిర్వహించనున్న ఈ ఎక్స్ పోకు శాఖాధిపతి ఆచార్య బీ.హెచ్ పద్మప్రియ గౌరవ అతిథిగా విచ్చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.




Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co